# నా యింట్లోకూడా ప్రవేశించిందే

బందా కనకలింగేశ్వరరావుగారు, బి.ఏ.

నారాయణరావుగారు డిప్యూటీ కలెక్టరు పనిలో నుండి సాధ్యమైనంతవరకు దేశ నాయకులను జైలుకు పంపించుదా మన్న ప్రముఖులలో నొకరు. అందులో పదెకరముల పొలమో, రావు సాహేబు బిరుదైనా తెచ్చుకోవా లనే దీక్షతో, సాధ్యమైనంతవరకు సి. క్లా సిస్తూ, రెండేళ్లకు తక్కువ కాకుండా, పెద్దా చిన్నా అనేపంక్తిభేదం లేకుండా, నిష్పక్షపాతంగా, ఉదారమానసంతో వడ్డిస్తున్నారు. కావున వీరికి పెద్దకలెకటేరుపదవి నొతుందని పిప్పరవంతెనకడ రాజు లనుకొనేమాట అబద్ధ మనుకోటాని కెలాగు!

విశాలాక్షమ్మమాత్రం తక్కువ తిన్నదని పంటే ఒప్పుకోను. మాయస్వరాజ్యంలో, అల్లుడు జైలు కెళ్ళాడని మనింటికి రావద్దని రిజిస్టరీ నోటీ సిప్పించింది, బుద్ధిమంతురాలు. బరువుగా వుంటుందని ఖద్దరుజోలికి పోకుండా బెనారసుచీరలు కడుతోంది. ఖరీదైన ఖద్దరెందుకని కంచిపట్టుచీరలు కొనమంది. అనవసరంగా ముతకచీర లెందుకని ఆగ్రాచీరలు మాత్రమే కొనాలని ఉద్దేశ్యంతో వుం౽. అనుకూలదాంపత్య మంటే ఇంతకంటె ఏం గావాలి!!!

సూరీడు చదివేది చిన్నక్లాసైనా చురుకైనవాడు. కాస్తో కూస్తో అల్లరిలోకూడా ప్రవేశం ఉంది. ఒకమాటు దబ్బున శనివారం రాలేదని కేలండరు చింపేసిన బాపతు. పాఠం చదవడం మానేసి బడి కెళ్లి ఆఖరు బెంచిమీద కూర్చొని అందరూ ఒప్పగించాక విని తాను కూడా ఒప్పజెప్పేవాడు. పరీక్షలో ఫస్టుమార్కే. కాబట్టి అల్లరి పిల్లలే తెలివితేటలు గలవారు. అల్లరంటే తెలివి అనేపాలు పొంగిపోతే ఇటు అటు పడే మీగడ!

ప్రతినిత్యం తనస్నేహితుడగు రాముడింటికెళ్లేవాడు సూరీడు. రాముడు అమ్మ ఇద్దరకూ పాఠాలు చెపుతుండేది. మంచిది. తను రాట్నం వడుక్కుంటూ పనిలో పని వీళ్లిద్దరకూ పాటలు కూడా చెపుతుండేది. సూరీడుకు పాఠాలమీద మనస్సు లేకపోయినా పాటలమీద మాత్రం ఉంది. రాముడుకన్న తనకే ముందరొచ్చేవి పాటలు. అయితే ఆపాటలే ఇంటి కొచ్చి పాడితే అంత అందంగా ఉండవేం అన్న ప్రశ్న వాడిని బాధిస్తోంది. తుదకు రాట్ననాదంలోగాని తనపాట రాణించదని తోచింది. ఎవళ్లింటో చూచినా రాట్నమే!! తనింట్లో మాత్రం లేదని చింతించాడు. ఇంట్లో రాట్నం మా టెత్తితే రాచిప్పతో కొడతారు. గ్రహించాడు సంగతి. ఆలోచించాడు ఉపాయం. తలుచుకొన్నాడు త్రొక్కేదారిని. ఏమన్నా సరే, ఎత్తేడు ఎత్తు. పట్టుదలమాత్రం బాగా ఉంది.

విభూది పెట్టంతా వెతికితే దొరికింది వెండిబేడ. బజారుకు గిరుక్కున తిరిగేడు. వడ్రంగి అప్పలస్వామి నడిగితే రూపాయి కిస్తా నన్నాడు రాట్నం. అమ్మ బాబో, ఎక్కడ బేడ ఎక్కడ రూపాయి! ఎలాగైనా రూపాయి సంపాదించాలి. అర్ధణాబిళ్లకు పాదరసం రాదా మనుకొన్నాడు కాని దానిమీద వెధవ తేలుబాటి బొమ్ముంది. పైగా చుట్టూరా గరుకుగా లేదు. వాడి చిన్నబుద్ధికి ఒకటి తట్టింది. అదే సన్మార్గం——సాగేది, సమకూర్చేది.

గ్రామమునసబు వెంకటస్వామి మామిడితోట ఊరవత లుంది. కొంచెం చిన్నకాలవ ఒకటి దాటాలి. జహంగీరు మామిడిపళ్లకు ప్రసిద్ధి. ఈతనితండ్రి కళింకోటలో పనిజేసినప్పుడు తెప్పించాడ టీవిత్తనం. సూరీడుకు మామిడిపళ్ల సంగతి బాగాతెలుసు, ఎక్కడున్నాయో, ఎలా తేవాలో! వాడి మనస్సు ఎలా ఉండాలో అలా ఉంది. వెంటనే తోటకి దారిబట్టేడు. మునసబుతోటకి జేరేడు కేకేసి మునసబుచేతులో బేడ పెట్టి మామిడిపళ్లివ్వ మన్నాడు. మునసబుకు సమయం దొరికింది. తోటలో పళ్లు ఎన్నిమార్లు రుచి చూడమని పంపినా తిరుగగొట్టేవారు కలెక్టరుగారు. కలెక్టరు గారబ్బాయి వచ్చేడుగదా యని మంచిరకం జాహంగీరుపళ్లు పిల్లవాడు మోసినన్ని అనగా ఎనిమిదిపళ్లిచ్చాడు. డబ్బు పుచ్చుకుంటే కాని వద్దంటాడు సూరీడు. బలవంతాన బేడమునసబుదగ్గిర పడవేసి ఇంటికి మళ్లినాడు.

సూరీడుఆలోచన సామాన్యం గాదు. పట్టలేని ఆనందంతో పరవళ్లుత్రొక్కి పళ్లన్ని అమ్ముదా మనుకొన్నాడు. కొనేవా రెవరయా! చిటికెనవ్రేలు ముడిచి నాన్న ఒకటి, అమ్మ, అక్కయ్య, బావ, తాత-అయిదుపళ్లు. తక్కినవి తహసీలుదారు కొకటి, మేజస్ట్రీటు కొకటి, హెడ్డుగుమాస్తా కొకటి.

ఇంటి కొచ్చేటప్పటికి సాయంత్రం అయిదయింది. ఎనిమిదేళ్ల కుర్రవాడు, అందులో లంచం దీసుకోని కలెక్టరుగారబ్బాయి, పళ్లమ్మితోంటే ముచ్చట కొక్కటి కొన్నాడు తహసీలుదారు బేడకి. మర్యాదకైనా కొనకపోతే మనస్సులో బెట్టుకు ఏం జేస్తాడో కలెక్టరని కొన్నాడు మేజస్ట్రీటు. కలెక్టరుకు కోపం లేకుండా గడిచిందే చాలు ఈజమాబంది, ఎందుకైనా మంచిదని కొన్నాడు హెడ్డు గుమాస్తా!

బావమరదిని చూస్తే ఏబావకు ముచ్చట కాదు? అందులో అక్కయ్య రెకమండు చేసింది. ఆతాలూకుపండుకు పావలా ముట్టింది సూరీడుకు. ఒక్కడే తమ్ముడు. అందులో పుట్టింటిఋణం తీరి చాలాకాల మైంది. తమ్ముడొచ్చాడనే సంతోషంతో తీసుకుంది ఒకపండు బేడకి. తాతకి పండు బలవంతాన కట్టి తలగడక్రింద బేడ లాగాడు. ఇక్కడికి పదునాలుగణాలు వచ్చాయి. ఇంటి కెళ్లేటప్పటికి ఏడయింది. చీవాట్లు చిన్నంగా తగిలాయి గాని కార్యసాధనంకోసం తల్లిదగ్గర జేరాడు

సూరీడు. నారాయణరావుగారుకూడా వంటింట్లోకి వచ్చాడు. చూచాడు సూరీణ్ణి. ఎక్కడకు వెళ్లావు వెధవా అని అష్టోత్తరశతంతో ఆరంభించాడు. రెండుపళ్లు తండ్రికిచ్చి పావలాకు తెచ్చానన్నాడు సూరీడు. అర్ధరూపాయికు రాని జహంగీరు అర్ధపావలాకు వచ్చిందని జేబులో పావలా చేతి కిచ్చాడు రావుసాహేబు నారాయణరావు.


రాత్రంతా కలలే సూరీడుకు రాట్నం కొన్నట్టు; ఆశబ్దంలో తాను కలిసి 'జయ భారత హే' పాడుతున్నట్టూ వెధవరాత్రి తెల్లవారదే అనుకొన్నాడు. లాంతరు తీసికెళ్లి దొడ్లో చూచాడు తనపేరిటివాడొచ్చాడేమోయని. ఇంకా మకమకలాడుతో ఉన్నాడుచంద్రుడు. కొంచెంసేపు పడుకున్నాడు తిరిగి వచ్చి. నిద్దర పట్టలేదు. సరే తెల్లవారింది. అప్పలస్వామింటికి పరుగెత్తి కెళ్లి రూపాయి బేడ యిచ్చి రాట్నం కదురు ఇవ్వమన్నాడు. అప్పలస్వామి ముచ్చటైన రాట్నానికి పసుపూ కుంకుమ పెట్టి సూరీడు కిచ్చాడు. బుజంమీద పెట్టికొని ఇంటికి పట్టుకువచ్చి మంచంక్రింద దాచాడు దాన్ని జాగ్రత్తగా గుడ్డగప్పి. తహసీలుదారుని, మేజస్ట్రీటును, హెడ్డుగుమాస్తాను పిలుచుకొచ్చాడు, నాన్న రమ్మంటున్నారని నాన్నగార్నికూడా చెయ్యి పట్టుకు లాక్కొచ్చాడు. రాట్నం ముందరెట్టాడు. కలెక్టరుగారింటో రాట్నం ఉందని గవర్నమెంటుకు రిపోర్టు చెయ్యనా, ఏకులు కొనిస్తారా అన్నాడు. రాట్నం ముందు పెట్టుకొని త్రిప్పుతూ తద్ధ్వనిలో శ్రుతిచేసి,

'రాట్నమే మనమూట యనుకొనుడు'

అని పాడాడు.

నారాయణరావు తెల్లబోయి, "నాయింట్లోకూడా ప్రవేశించిందే" అన్నాడు.

---




భర్త:—(ముద్దుగా) పిల్లా, నేను ముసలివాడనైనా, రూపుచెడినా నన్ను ప్రేమిస్తుంటావుగదూ?
భార్య:—మీరు ముసలివారౌతారు కాని యింతకంటె రూపు చెడలేరు.

---